రెగ్యులర్ పశువైద్యాధికారి లేక ఇక్కట్లు



తాళం వేసి ఉన్న పశువైద్యశాల

మండలంలోని గండిపాళెం పశువైద్యశాలకు దాదాపు ఐదేళ్లుగా రెగ్యులర్ పశు వైద్యాధికారి లేకపోవడంతో పాడి రైతులు, జీవాల పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పశువైద్యశాలకు ఉదయగిరి మండలం తిరుమలాపురం, గుడినరవ, చౌడేపల్లి, దాసరపల్లి, అప్పసముద్రం, వెంకట్రావుపల్లి, కొండాయపాళెం, గంగిరెడ్డిపల్లి, మాసాయిపేట, సున్నంవారిచింతల, దుంపవారిపల్లె గ్రామాలతో పాటు వరికుంటపాడు మండలం కొండారెడ్డిపల్లి, కొత్తపల్లి, ఇస్కపల్లి, యర్రంరెడ్డిపల్లి, ఎన్‌టీకాలనీ, కొండ్రాజుపల్లి గ్రామాలకు చెందిన పాడిరైతులు ఎక్కువగా వస్తుంటారు. వైద్యశాల పరిధిలో పశువులు సుమారు ఐదు వేలు, జీవాలు 35 వేలు, కోళ్లు ఆరు వేల వరకు ఉంటాయి. ఈ వైద్యశాలకు రెగ్యులర్ పశు వైద్యాధికారిని నియమించకపోవడం.. ఇన్‌చార్జి వైద్యాధికారి ఎప్పుడొస్తారో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని పాడిరైతులు కోరుతున్నారు.

– ఉదయగిరి రూరల్

చెరువును చెరపట్టిన తమ్ముళ్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. వాగులు, వంకలే కాకుండా చెరువులను సైతం ఆక్రమిచేస్తున్నారు. మండలంలోని జమ్మలపాళెం చెరువు ఆక్రమణల కోరలో చిక్కుకుంది. హైవేకు ఆనుకుని చెరువు ఉండడంతో కబ్జాదారుల కన్ను పడింది. ఈ క్రమంలో గ్రామ పెట్రోల్ బంకు సమీపంలో చెరువు స్థలంలో టీడీపీ తమ్ముళ్లు భారీగా గ్రావెల్ తోలి ఆక్రమణలకు పూనుకున్నారు. ఇందులో లేఅవుట్ వేసి అక్రమంగా సంపాదించుకోవచ్చనే ఆశతో ఆక్రమణలకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే దీనిన మరో టీడీపీ నాయకుడు అడ్డుకున్నట్లు తెలిసింది. అలాగే రామవరప్పాడు చెరువులో టీడీపీకి చెందినవారు దాదాపు మూడు ఎకరాల భూమిని ఆక్రమించుకుని చుట్టూ కంచె వేసి వాడుకుంటున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

– జలదంకి



జమ్మలపాళెంలో చెరువు స్థలంలో తోలిన గ్రావెల్

చిట్టడవిని తలపిస్తున్న ఎన్టీఆర్ కాలనీ



ఎన్టీఆర్ కాలనీకి వెళ్లే మార్గాన్ని ఆక్రమించిన కంపచెట్లు

అనంతసాగరం మండలం సోమశిల హిల్‌కాలనీ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ కాలనీ చిట్టడవిని తలపిస్తోంది. 2014–19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ కాలనీ పేరుతో సుమారు 70 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేసింది. అందులో పది కుటుంబాలు మాత్రమే బిల్లులతో సంబంధం లేకుండా పూర్తిస్థాయిలో గృహ నిర్మాణాలు పూర్తిచేసుకుని నివాసం ఉంటున్నారు. మిగిలిన వారు బేస్‌మెంట్, శ్లాబ్‌లెవల్లో బిల్లులు పడక నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. కొండప్రాంతం కావడంతో ప్రస్తుతం ప్లాట్లలో కంపచెట్లు దట్టంగా పెరిగి విషసర్పాలకు నిలయంగా మారడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కాలనీకి వెళ్లే గ్రావెల్‌రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి ఉండడం.. వీధి దీపాలు లేకపోవడంతో చీకటిపడితే స్థానికులు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. కాలనీకి పెన్నా నుంచి నిర్మించిన మంచినీటి పైప్‌లైన్ నిరుపయోగంగా మారడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలాధికారులు స్పందించి కనీసం ఉపాధి హామీ పథకం కింద అయినా కాలనీలోని కంప చెట్లను తొలగించాలని, కాలనీకి వెళ్లే రోడ్డులో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సోమశిల

క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



కొండాపురం: మండలంలోని కొమ్మి గ్రామంలో తిరునాళ్లను పురస్కరించుకుని ఏడో రోజు శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలైన రామానుజపురం, కుంకువారిపాళెం, సత్యవోలు తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఉభయకర్తలుగా యాదవులు వ్యవహరించారు. తొలుత స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు: పట్టణంలో ఇటీవల వివిధ కారణాలతో ఎనిమిది మంది మృతిచెందగా వారి కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. స్థానిక ఐదో వార్డు పరిధిలో పర్వీన్, అదే వార్డుకు చెందిన ఖాదర్‌బాషా, 13వ వార్డు పరిధిలో పూసపాటి చిన్నమ్మ, 15వ వార్డు పరిధిలో ఏటూరి గురవయ్య, 16వ వార్డు పరిధిలో షాన్‌వాజ్, 17వ వార్డు పరిధిలో షేక్ ఖాజారంతులా, 22వ వార్డు పరిధిలో ఇండ్ల అంకమ్మ, 23వ వార్డు పరిధిలో షేక్ మౌలాలిలు మృతి చెందడంతో బాధిత కుటుంబాల వారికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.80 వేలను ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, రామ్‌పల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మర్రిపాడు: నాలుగు దశాబ్దాల క్రితం కలసి చదువుకున్న విద్యార్థులంతా ఒకచోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పి తమ ఎదుగుదలకు దోహదం చేసిన గురువులను సన్మానించుకున్నారు. ఇందుకు నెల్లూరులోని ఓ ప్రైవేట్ హోటల్ వేదికైంది. మర్రిపాడు మండలం కంపసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థులు నాలుగు దశాబ్దాల అనంతరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. సుమారు 30 మంది పూర్వ విద్యార్థులు కలుసుకోవడంతో వారు ఆనందంతో మునిగిపోయారు. చిన్ననాటి అనుభూతులు, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా సాగారు.

పింఛన్ల నిలిపివేతపై ఆందోళన

కొండాపురం: రాజకీయ కక్షతో తమకు పింఛన్లు నిలిపివేశారని సత్యవోలు పంచాయతీ అగ్రహారానికి కొందరు వృద్ధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ పంచాయతీలో టీడీపీ నాయకుల మాటలు విని వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి ఐదుగురు వృద్ధులకు పింఛన్లు ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీఓ నారాయణను వివరణ కోరగా పింఛన్ ఇచ్చే సమయంలో వారు గ్రామంలో అందుబాటులో లేరని, వచ్చే నెలలో రెండు నెలలు కలిపి అందజేస్తామని సమాధానమిచ్చారు.

పేద విద్యార్థినికి అన్యాయం

- ప్రైవేటు సేవలో ప్రతిభా అవార్డులు



ధనలక్ష్మి

వింజమూరు(ఉదయగిరి) : రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రకటించిన షైనింగ్‌స్టార్ ప్రతిభా పురస్కారాల్లో వింజమూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన పాతల ధనలక్ష్మి అనే పేద విద్యార్థికి అన్యాయం జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విభాగాలకు చెందిన విద్యార్థులను మండలానికి ఆరుగురు చొప్పున ఎంపిక చేశారు. వింజమూరు మండలంలో ఆరుగురిని ఎంపిక చేయాల్సి ఉండగా, ఒకే మార్కులు సాధించిన ఇద్దరు ఓసీ విద్యార్థులను అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో 592 మార్కులు సాధించిన ధనలక్ష్మి పేరు లేదు. మండలంలో నారాయణ ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ముగ్గురు ఎంపిక కాగా, సరస్వతి ప్రైవేటు స్కూల్‌కు చెందిన మరొకరిని ఎంపిక చేశారు. అయితే ప్రభుత్వ పాఠశాలలో చదివి 592 మార్కులు సాధించిన పేద విద్యార్థినికి అన్యాయం జరగడం పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మాత్రమే ఈ అవార్డుకు ఎంపిక చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలను పరిగణనలోకి తీసుకోవడంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది.

ప్రైవేటు విద్యార్థులకే ప్రతిభా అవార్డులు

ఉదయగిరి: మండలంలోని పలువురు పదో తరగతి విద్యార్థులు ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈఓ తోట శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. స్థానిక సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్.తయబ, హోలీ ఏంజెల్స్ పాఠశాలకు చెందిన షేక్.ఇశ్రత్ ఫాతిమ, ఎస్.భవ్యశ్రీ, గడ్డంవారిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన డి.స్రవంతి, జి.భరద్వాజ్‌లు ఎంపికయ్యారన్నారు.



పెద్దిరెడ్డి సంహిత



పి.మేఘన

- దుత్తలూరు : రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పేరిట పదో తరగతి విద్యార్థులకు ప్రకటించిన ప్రతిభా పురస్కారాలకు విశ్వతేజ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పెద్దిరెడ్డి సంహిత, పి.మేఘనకు ఈనెల 9న నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో రూ.20 వేల నగదుతో పాటు సర్టిఫికెట్, మెడల్ అందజేయనున్నారు. ఈ క్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను కరెస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.
- వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన ఏడుగురు పదో తరగతి విద్యార్థులు షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల మేరకు ఓసీ విభాగంలో ఇద్దరు, బీసీ విభాగంలో ఇద్దరు, ఎస్సీ, ఎస్టీ విభాగంలో ఒకరు వంతున ఆయా కేటగిరీల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. నారాయణ ప్రైవేటు పాఠశాలకు చెందిన మద్దసాని దేవీచరణ్ (595 మార్కులు), పి.వీరవెంకట సాయిసంతోష్ (595), నల్లగొండ్ల సాయికిరణ్ (593), వి.వెంకట శేషసాయి సాత్విక్ (591), వై.లక్ష్మీప్రవీణ్‌రెడ్డి (591), అదేవిధంగా సరస్వతి స్కూల్‌కు చెందిన చీకటి కార్తికేయ (586), వింజమూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన గంగవరపు జ్ఞాపిక (593) ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి రూ.20 వేల ప్రోత్సాహక నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించనున్నట్లు చెప్పారు.

ఎన్‌ఎంయూఏ ఉద్యోగుల నిరసన



ఉదయగిరి: తమ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు గత మూడు రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు వెంకటేశ్వర్లు, శంకర్, శివ, శ్రీను, రాములు, సలాం, కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న రామిరెడ్డి-ఆదిలక్ష్మి దంపతులు



మడపల్లి గ్రామంలోని వివాహ వేడుకలో విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి

కావలి (జలదంకి): కావలి పట్టణంలోని మూడో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మండలి కృష్ణారావు కుమార్తె వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి హాజరయ్యారు. బృందావనం కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకలో వధూవరులు యశ్వంత్-రమ్యశ్రీలను ఆశీర్వదించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

- చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలంలో గురువారం రాత్రి జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు. కోటితీర్థం గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులు గోతం నరేష్, సంధ్యలను ఆశీర్వదించారు. అదే క్రమంలో మైపాటివారికండ్రిక గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని దంపతులు శ్రీలక్ష్మి, హర్షవర్ధన్‌లను ఆశీర్వదించారు. అదే గ్రామంలో పార్టీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి కుమారుడు విజయ్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మడపల్లి గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తరుణీప్రియ దంపతులను ఆశీర్వదించారు. పార్టీ నాయకులు కర్నా వెంకటేశ్వర్‌రెడ్డి, కర్నా వేణుగోపాల్‌రెడ్డి, గోతం వెంకట సుబ్బయ్య, సర్పంచ్ సృజన, సింగవరపు గంగాధర్‌రెడ్డి, కలుకూరు విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, పూనూరు రామమనోహర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు, సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు

ఆత్మకూరు: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 5–15 ఏళ్ల వయస్సు గల పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసేందుకు పాఠశాలలు, సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.గంగాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు, తిరిగి 24 నుంచి 27వ తేదీ వరకు క్యాంపులు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలువురికి రామిరెడ్డి పరామర్శ

కావలి (జలదంకి): పట్టణంలోని తొమ్మిదో వార్డుకు చెందిన వేమూరు శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయన నివాసానికి శుక్రవారం వెళ్లి పరామర్శించారు. అలాగే కావలి పట్టణ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు కాలికి ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

ఎరువుల కోసం ఇండెంట్ ఇవ్వండి

మర్రిపాడు: రానున్న పంట కాలానికి సంబంధించి ఎరువులు కావాల్సిన రైతులు ఈనెల 30వ తేదీలోగా ఇండెంట్ ఇవ్వాలని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. ఒక్కో బ్యారెన్‌కు అడ్వాన్స్‌గా రూ.10 వేలు ఇవ్వాలని, ఇది పొగాకు అమ్మకాల్లో మినహాయిస్తామన్నారు. అమ్మోనియం సల్ఫేట్ 12 బస్తాలు, డై అమ్మోనియం ఫాస్పేట్ 5 బస్తాలు, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 8 బస్తాలు, కావాల్సిన వారికి కాల్షియం నైట్రేట్ 7 బస్తాలు అందిస్తామని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం ప్రారంభం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో ఎన్నారై సేగు సతీష్, సుబ్బారావు కుటుంబ సభ్యులు శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని, మాట్లాడారు. ఈ శిబిరం జూన్ 14 వరకు కొనసాగుతుందని, సుమారు వెయ్యి మంది పేదలకు ఉచిత కంటి ఆపరేషన్ చేయించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. స్థానికులు ఎల్లాల రఘురామిరెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, డాక్టర్ మాశిలామణి, తిరుపాల్‌రెడ్డి, కొండారెడ్డి, గోపి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'భలే జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ



ఉదయగిరి: పట్టణంలోని చైతన్య ఐటీఐ కళాశాలలో సీనియర్ జర్నలిస్ట్ షేక్.ఫయాజ్ రచించిన భలే జ్ఞాపకాలు పుస్తకాన్ని డాక్టర్ వేణుగోపాల్ శుక్రవారం ఆవిష్కరించారు. స్థానికులు ఖాదర్‌బాషా, ఖాజా, అహ్మద్ బాషా, తాజుద్దీన్, దస్తగిరి అహ్మద్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



ద్రాక్షాయిణి



సంజనా లాస్య



రోషిణి



సనా



శివకృష్ణ

మర్రిపాడు: మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఐదుగురు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఒకే పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న కె.సంజనా లాస్య, ఎంపీ రోషిని, షేక్.సనా, ఎల్.ద్రాక్షాయిని, కె.శివకృష్ణలు ఎంపికయ్యారు. వీరికి ఇంటర్ పూర్తయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

రేపట్నుంచి అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు

ఉదయగిరి రూరల్: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో కొలువైన అడవి పేరంటాలమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి గురువారం వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడ్డంవారిపల్లి నుంచి ఆదివారం నిలుపు కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీ, గన్నేపల్లిలో సోమవారం, మిట్టపల్లి, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, పేరంటాలమ్మ నగర్ గ్రామాల్లో మంగళవారం గ్రామోత్సవం జరుగుతుందన్నారు. పసుపు కుంకుమ బండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు బుధవారం జరుగుతాయన్నారు. బండ్ల పొంగళ్లు, ఎడ్లచే బండలాగుడు పోటీలు, విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలు గురువారం జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఉత్సవాలకు ముస్తాబైన పేరంటాలమ్మ ఆలయం

త్యాగానికి ప్రతీక బక్రీద్

- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు : అల్లాహ్ ఆశీస్సులతో సన్మార్గంలో నడుస్తూ దాతృత్వానికి, త్యాగాలకు ప్రతీకైన బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం కోరారు. శనివారం బక్రీద్ పండగ నేపథ్యంలో ముస్లింలు సన్మార్గంలో జీవిస్తూ దేవునిపై విశ్వాసంతో దాతృత్వాన్ని పెంచుకోవాలన్నారు. బక్రీద్ పండగను ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు.

అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలి

వరికుంటపాడు: ప్రజలపై అల్లహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలని, బక్రీద్ పండగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మందలపు తిరుపతి నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని, అప్పుడే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

జలదంకి: బక్రీద్ పండగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జలదంకి ఎస్సై లతీఫున్నీసా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. గోవులు, లేగదూడల వధకు పాల్పడకూడదని సూచించారు. రెచ్చగొట్టే ప్రకటనలు, ప్రసంగాలు చేయరాదని, సోషల్ మీడియాలో ఎలాంటి అసభ్యకర పోస్టులు పెట్టరాదన్నారు.

తప్పులను సవరించాలని ఆందోళన

ఉదయగిరి రూరల్: మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో భూముల రీసర్వేలో జరిగిన తప్పులను సవరించి న్యాయం చేయాలని పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల రీసర్వేలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక తప్పులు చోటుచేసుకున్నాయన్నారు. గ్రామంలో లేనివారిని, చనిపోయిన వారి పేర్లను అడంగల్‌లో నమోదు చేశారన్నారు. వాటిని సవరించాలని గత కొంతకాలంగా జిల్లా, రెవెన్యూ డివిజినల్, మండలస్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఫలితంగా గ్రామంలో వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. పంటల సాగుకు బ్యాంకు రుణాలు తీసుకునేందుకు వీలులేకుండా పోయిందన్నారు. అనంతరం తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందించారు. ఆమె స్పందించి వీఆర్వో, సర్వేయర్‌ను పంపి విచారించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

జిల్లా ఫ్లోరోసిస్ అధికారి పరిశీలన

దుత్తలూరు : మండలంలోని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తెడ్డుపాడు, కొత్తపేట, నర్రవాడ గ్రామాల్లో జిల్లా ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ దివ్య శుక్రవారం పరిశీలించారు. ఫ్లోరోసిస్‌కు గురై ఉన్నారనే అనుమానం గల పిల్లలను పరీక్షించారు. అలాగే తగిన సూచనలు, సలహాలందించారు. కార్యక్రమంలో నర్రవాడ వైద్యాధికారి హరీష్, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ దివ్య

అండగా ఉంటాం

జలదంకి: మండలంలోని చామదల పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన కొమర రత్తయ్య హౌసింగ్ ఫైనాన్స్ వేధింపులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వేణుగోపాలపురంలోని అతని నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి ఉన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా మురళీరెడ్డి

మర్రిపాడు: మర్రిపాడు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి పాల్గొని బీజేపీ మండలాధ్యక్షుడిగా మురళీరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.